నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్



బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## కేటీఆర్‌ను కలిసిన నాయకులు

భైంసా, ఫిబ్రవరి 8 : హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కొమ్రేవార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనతోపాటు అమెరికాలోని ఇల్లినాయిస్ స్టేట్ నుంచి టిమోరియా పట్టణానికి చెందిన డిప్యూటీ మేయర్ కిరణ్ వెల్పూరి కూడా ఉన్నారు.


కేటీఆర్‌ను కలిసిన ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు

## స్థానిక ఎన్నికల్లో విజయం మనదే

- మాజీ మంత్రి జోగు రామన్న
- ఆదిలాబాద్ రూరల్ నాయకులతో సమావేశం

ఆదిలాబాద్, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పార్టీ 14 నెలల పాలనలో ప్రజలు విసిగి వేసారిపోయారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదిలాబాద్ రూరల్ మండలం నాయకులతో ఆయన సమావేశమై ఎన్నికల్లో అనుసరించాల్సిన విధానంపై దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, ఆరు గ్యారెంటీలతో పాటు 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులతోపాటు అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పలు సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను ఎండగట్టాలన్నారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన తప్పుల తడకగా మారిందన్నారు. ఎన్నికల్లో పకడ్బందీ ప్రణాళికలతో పార్టీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని సూచించారు. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని, అభివృద్ధిని పట్టించుకోకుండా భూ కబ్జాలు, వ్యాపారానికి ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రౌతు మనోహర్, విజ్జిగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, యాసం నర్సింగరావు, సెవ్వా జగదీశ్, గోవర్ధన్, చందాల రాజన్న, ప్రమోద్‌రెడ్డి, సతీశ్ పవార్, గంభీర్ ఠాక్రే, దేవన్న, పరమేశ్వర్ పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

## కేసీఆర్ క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారు

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**


ఎదులాపురం, ఫిబ్రవరి 8 : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీయడానికి మాజీ సీఎం కేసీఆర్ క్రీడా మైదానాలను ఏర్పాటు చేశారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గుర్తు చేశారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బెల్లూరి మైదానంలో మాజీ మంత్రి జోగు రామన్న తల్లిదండ్రులు ఆశన్న-భోజమ్మ జ్ఞాపకార్థం జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, సాజిదొద్దీన్, పవన్ నాయక్, యూనిస్ అక్బాని, నారాయణ, ప్రహ్లాద్, శివ, అయ్యూబ్, తదితరులు పాల్గొన్నారు.

# సమరానికి సై




**ఈ నెలలోనే స్థానిక పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్!**

- ముందు ఎంపీటీసీ, జడ్పీటీసీ.. తర్వాత సర్పంచ్..
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు.. రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ
- తప్పుల తడకగా కులగణన లెక్కలు.. కాంగ్రెస్ పార్టీకి చిక్కులు..




జిల్లాల వారీగా సర్పంచ్ స్థానాలు..

మంచిర్యాల, ఫిబ్రవరి 8(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల సమరానికి సమయం వచ్చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఓకే చెప్పడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పల్లెపోరుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. ఈ నెల 15వ తేదీలోగా ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడుతాయంటూ ప్రచారం జోరందుకున్నది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ముందు నిర్వహించి, అవయ్యాక సర్పంచ్ ఎన్నికలు ఉంటాయని చెప్తున్నారు. అధికారులు మండల, జిల్లా పరిషత్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ మేరకు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల పునర్విభజన కూడా పూర్తి చేశారు. పంచాయతీరాజ్ చట్టం 2018 ప్రకారం ప్రతి మండలానికి ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలన్న నిబంధన ఉంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ సంఖ్య పెరిగింది. ఆదిలాబాద్‌లో జిల్లాలో గతంలో 158 ఎంపీటీసీలు ఉంటే ప్రస్తుతం 8 స్థానాలు పెరిగాయి. జడ్పీటీసీలు 17 నుంచి 19కి పెరిగాయి. సోనాల, సాత్నాల రెండు కొత్త మండలాలు ఏర్పడడంతో స్థానాలు పెరిగాయి. ఇక నిర్మల్ జిల్లాలో 156 నుంచి 157 ఎంపీటీసీలకు పెరిగాయి. పెంబి మండలం వెంకంపోచంపాడు అనే ఎంపీటీసీ స్థానం పెరిగింది. జడ్పీటీసీలు గతంలో మాదిరి 18 ఉన్నాయి. ఆసిఫాబాద్ జిల్లాలో 123 ఉన్న ఎంపీటీసీ స్థానాలు 127కి పెరిగాయి. జిల్లాలోని రాజంపేట, సిర్పూర్(యూ) మండలాల్లోని రాఘవపూర్, లింగాపూర్ మండలంలోని కంచన్‌పల్లి, పెంచికల్‌పేట్ మండలంలోని కమ్మర్‌గాంలో ఎంపీటీసీ కొత్త స్థానాలు ఏర్పాటు చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటుతో హాజీపూర్ మండలంలోని గ్రామాల సంఖ్య తగ్గింది. దీంతో ఆ మండలంలో ఎంపీటీసీల సంఖ్య 9 నుంచి 6కి తగ్గింది. చట్ట ప్రకారం భీమారం, భీమిని మండలాల్లో ఒక్కో స్థానం పెరిగింది. దీంతో మంచిర్యాల జిల్లాలో గతంలో 130 ఉన్న ఎంపీటీసీ స్థానాల సంఖ్య 129కి తగ్గింది.

### అధికార పార్టీకి తలనొప్పిగా మారిన సర్వే.. రిజర్వేషన్లపై ఉత్కంఠ..

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కులగణన సర్వే లెక్కలు విడుదల చేయడం అధికార కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందిగా మారనుంది. తప్పుల తడకగా సర్వే చేశారంటూ బీసీలు మండిపడుతున్నారు. స్థానిక సంస్థల్లో తమ రిజర్వేషన్‌ను తగ్గించే కుట్రలో భాగంగా జనాభాను తగ్గించి చూపించారనే ఆరోపిస్తున్నారు. మరోవైపు ఎస్సీ వర్గీకరణపై కూడా మాదిగ, మాల సామాజిక వర్గాలు ఎవరికి వారు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి ప్రతికూల ఫలితాలు వస్తాయనే అంచనాలు వినిపిస్తున్నాయి. పైగా 13 నెలల పాలనపైనా జనం అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా, మండల పరిషత్‌ల ఎన్నికలను ముందు నిర్వహిస్తే.. అది కూడా మైనస్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. ఆ ప్రతికూల ప్రభావం సర్పంచ్ ఎన్నికలపైనా పడుతుందని నిపుణులు అంటున్నారు. జిల్లా, మండల పరిషత్‌ల పాలకవర్గాలు ఖాళీ ఏర్పడి ఎనిమిది నెలలు గడిచింది. ఇక గ్రామ పంచాయతీల్లో పాలకవర్గాల పదవీకాలం పూర్తయి ఏడాది పూర్తయ్యింది. చాలా కాలంగా గ్రామాలు, మండలాల్లో ప్రత్యేక అధికారుల పాలన నడుస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ ప్రకటన రావడం చర్చనీయాంశంగా మారింది. ముందు పంచాయతీ ఎన్నికలా? లేక జిల్లా, మండల పరిషత్ ఎన్నికలా? అన్న విషయాన్ని పక్కన పెడితే ఎన్నికల కోసం ఎదురు చూసే ఆశావహుల సంఖ్య గతంతో పోలిస్తే భారీగా పెరిగింది. కులగణన సర్వే పూర్తవడంతో రిజర్వేషన్ల అంశంలో అన్ని సామాజిక వర్గాల నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు. మా ఊరు రిజర్వేషన్ బీసీకి వస్తదా? ఎస్సీకి వస్తదా? జనరల్‌కు వస్తదా? మహిళలకు ఇస్తారా? అంటూ ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. గ్రామంలో గతంలో ఉన్న రిజర్వేషన్లు, గ్రామ జనాభా, రొటేషన్ పద్ధతిలో ఎవరికి ఇస్తారో అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రిజర్వేషన్లు ఖరారై నోటిఫికేషన్ వస్తే స్థానిక సంస్థల ఎన్నికల సమరం రసవత్తరంగా మారే అవకాశాలు ఉన్నాయి.



ఉమ్మడి జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు..


రైతు దున్నుతుండగా పొలంలో కొంగలు

## కొంగల కోలాహలం

*నిర్మల్ జిల్లా రూరల్ మండలంలోని గ్రామాల్లో పొలాల్లో రైతులు వరినాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నారు. పొలంలో చుట్టూ కొంగలు చేరి క్రిమి కీటకాలను తినేందుకు ట్రాక్టర్ చుట్టూ వందల సంఖ్యలో తెల్లని కొంగలు చేరి కోలాహలం చేశాయి. ఈ కనువిందైన దృశ్యాలను నమస్తే కెమెరా క్లిక్ మనిపించింది.* - నిర్మల్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 8

## అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

ఎదులాపురం, ఫిబ్రవరి 8 : మహారాష్ట్రలో దొంగలించిన ద్విచక్ర వాహనంతోనే తెలంగాణ రాష్ట్రంలోని ఆదిలాబాద్ జిల్లాలో దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు వన్ టౌన్ సీఐ బి.సునీల్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా కొర్పనా తాలూకా పరధి గూడకు చెందిన షెర్కురే ప్రదీప్(20), కితాలి బోర్మల్ తాలూకా చింధిమల్ గ్రామం చెందిన జగేశ్వర్ నన్నవారే (34) మద్యానికి బానిసై జల్సాలకు అలవాటు పడుతూ దొంగతనాలకు అలవాటు పడేవారు. ఈ క్రమంలోనే మహారాష్ట్రలో దొంగతనం చేసిన ద్విచక్ర వాహనంతో ఈనెల మూడవ తేదీన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రవీంద్ర నగర్‌లో నివాసం ఉండే ఐసీడీఎస్ సీనియర్ అసిస్టెంట్ రాజేశ్వర్ తన ద్విచక్ర వాహనాన్ని ఉదయం ఇంటి బయట పార్కింగ్ చేశాడు. పార్కింగ్ చేసిన గంటకె వాహనం దొంగతనం అయిందన్నారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా శనివారం ఉదయం సీసీఐ ఫ్యాక్టరీ సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో అటువైపుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన పోలీసులు వారిని వెంబడించి వివరాలను రాబట్టారు. చేసిన దొంగతనాలు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. వారి వద్ద నుండి మహారాష్ట్ర చెందిన ద్విచక్ర వాహనంతోపాటు ఇటీవల అదిలాబాద్‌లో దొంగతనం చేసిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.


స్వాధీనం ద్విచక్రవాహనాలు, పట్టుబడిన దొంగలతో పోలీసులు

## గురుకుల విద్యార్థినికి ప్రధానమంత్రి మోదీ ప్రశంస


ఎస్ వర్షిత

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 8 : నిర్మల్ పట్టణంలోని సోఫినగర్ గురుకుల పాఠశాలకు చెందిన పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్ వర్షితకు అరుదైన గౌరవం దక్కింది. 2024 సెప్టెంబర్‌లో జాతీయ స్థాయి లో నిర్వహించిన ప్రయోగాత్మక నైపుణ్య అభివృద్ధి భారత నిర్మాణంలో ఐదు మౌలిక సూత్రాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని ప్రజెంటేషన్ ఇచ్చింది. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థిని హర్షితను అభినందిస్తూ పాఠశాలకు లేఖ పంపారు.

## విద్యార్థినిని చితికబాదిన వార్డెన్


విద్యార్థి చేతులపై వాతలు

ఇచ్చోడ, ఫిబ్రవరి 8 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో సంతోష్ అనే విద్యార్థి చదువుకుంటున్నాడు. శనివారం ఉదయం హాస్టల్‌లో సంతోష్ అల్లరి చేయడంతో వార్డెన్ నిరజంన్ ప్లాస్టిక్ పైపుతో చితకబాదడంతో వాతలు వచ్చాయి. ఇదే సమయంలో తల్లిదండ్రులను విద్యార్థిని చూడడానికి వచ్చారు. దీంతో తల్లిదండ్రులు సువర్ణ, మరిబా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు వార్డెన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

## ప్రైవేట్‌కు దీటుగా బోధన

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 8 : ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన బోధన అందించాలని ఇంటర్మీడియెట్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య సూచించారు. శనివారం మండల కేంద్రమైన దిలావర్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వచ్చే విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు అధ్యాపక బృందం కలిసి పనిచేయాలని సూచించారు. మన కళాశాలలో చదువుకునే విద్యర్థులకు అందిస్తున్న సౌకర్యాలను వివరించాలని కోరారు.

## విద్యతోపాటు ఆటల్లోనూ రాణించాలి

**నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులను ఆటపాట ఆడిస్తున్న ఆడిషనల్ కలెక్టర్

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 8 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు విద్యతోపాటు ఆటల్లోను రాణించే విధంగా వారిని ఆడించాలని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ హమ్మద్ సూచించారు. శనివారం మండంలోని న్యూలోలంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు.అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. కేంద్రంలోని చిన్నారులతో పాడించి ఆడించారు. అక్కడి నుంచి ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న నర్సరీని పరిశీలించారు. మొక్కల పెరుగుదలకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. అక్కడే ఉన్న సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి, సంపదను సృష్టించే కార్యక్రమాలు తీసుకురావాలని ఆదేశించారు. ఈయన వెంట సీడీపీవో నాగమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ప్రసన్నకుమారి, అంగన్‌వాడీ టీచర్ కళావతి, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

## డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్

వర్క్‌షాప్ ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న వీసీ గోవర్ధన్



బాసర, ఫిబ్రవరి 8 : బాసర ఆర్జీయూకేటీలో శనివారం డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్ విభాగం, టీ హన్ ఐఐటీ హైదరాబాద్ సహకారంతో డిజైన్ అండ్ ఫ్లై ది డ్రోన్స్ అనే పేరిట ఐదు రోజులపాటు ఈ వర్క్‌షాప్ జరగనున్నట్లు వీసీ గోవర్ధన్ తెలిపారు. ఓఎస్డీ మురళీ దర్శన్, ఏవో రణధీర్ సాగిలతో కలిసి ఆయన ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించారు.